# నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తమైన తెలంగాణ

## (17 సెప్టెంబర్ "తెలంగాణ విమోచన దినం" సందర్భంగా)

17 సెప్టెంబర్ 1948 రోజున తెలంగాణ స్వాతంత్ర్య పొంది, నిజాం పాలనకు చర్మ గీతం పాడి, రజాకార్ల కబంధ హస్తాల్లోంచి విముక్తమై, భారతంలో విలీనమై, సువిశాల దేశంలో కలిసి సమైక్య భారతంలో భాగంగా స్వేచ్ఛను అనుభవిస్తున్నది మన నవ యువ తెలంగాణ రాష్ట్రం. వాస్తవ చరిత్రను మరిచిన రాజకీయ నాయకులు చరిత్రకు వక్రభాష్యం చెపుతూ విమోచనం కాదు, విలీనం, సమైక్యం అంటూ పార్టీలు తమ తమ భవితవ్యాలను రచించుకునే కుయుక్తులు పన్నుతున్న వేళ అచ్చ తెలంగాణ అభిమానులు నివ్వెరపోతున్న సందర్భమిది. నాటి నిజాం పాలనలో నలిగిన పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర ప్రాంతం 17 సెప్టెంబర్‌న 'మరట్వాడా విముక్త దినం', కర్నాటక ప్రాంతం 'హైదరాబాద్-కర్నాటక విముక్త దినం' పాటిస్తుండగా మన తెలంగాణ ప్రభుత్వం మాత్రం విలీనమని, సమైక్యమని జపం పాడడం విడ్డూరంగా ఉంది. తెలంగాణ విముక్త పోరులో అనేక తెలంగాణ వాసులు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా 1948 సెప్టెంబర్ 13-17 మధ్య జరిగిన 'పోలీస్ ఆక్షన్'లో 10 మంది భారత సైనికులు, 807 మంది నిజాం సైనికులు, 1,373 మంది రాక్షస రజాకార్లు మరణించారు. ఈ పోరాటంలో 1,647 పౌరులు/సైనికులు, దాదాపు 2,000 మంది రజాకార్లు గాయపడడం జరిగింది. నాటి విమోచన ఉద్యమంలో దాదాపు 40,000 మంది ప్రాణాలు కోల్పోయారని ఆనాడు నెహ్రూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సుందర్‌లాల్ కమిటీ' నివేదిక 2013లో విడుదలై వాస్తవ విషయాలను తెలుపుతున్నది. ఈ తెలంగాణ విమోచన పోరులో 2 లక్షల ప్రాణాలు కోల్పోయి ఉంటారని అభిప్రాయపడే వారు కూడా ఉన్నారు.

భారతదేశం 15 ఆగష్టు 1947న స్వాతంత్ర్య పొందగా, నాటి నిజాం పాలనలో తెలంగాణ ప్రాంతం మానభంగాలు, సామూహిక హత్యలు, దోపిడీలు, దుర్మార్గాల మధ్య నలుగుతూనే ఉన్నది. నాటి నిజాం పాలిత 'హైదరాబాద్ స్టేట్ (ప్రిన్స్లీ స్టేట్)' మాత్రం ఇండియాలో విలీనం చేయడానికి నిజాం అంగీకరించకుండా స్వతంత్ర దేశంగా ఉండడానికి నిజాం పాలకులు నిర్ణయించారు. నాటి స్వతంత్ర భారతంలో 584 ప్రిన్స్లీ స్టేట్స్ ఉండగా, వాటిని ఇండియా లేదా పాకిస్థాన్‌లో విలీనం కావడానికి బ్రిటీష్ పాలకులు స్వేచ్ఛను ఇవ్వడం జరుగగా వీటిలో అన్ని ప్రిన్స్లీ స్టేట్స్ విలీనాలకు అంగీకరించగా ఒక్క నిజాం పాలిత హైదరాబాదు స్టేట్ మాత్రం భారత్‌లో స్వచ్ఛందంగా విలీనం కావడానికి అంగీకరించ లేదు. దీని కారణంగా తెలంగాణ ప్రజలు భీకర సాయుధ పోరాటం చేయడం చూసాం. నాటి తెలంగాణ సమాజం నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల రాక్షస అరాచకాలకు, భూస్వాముల (43 శాతం భూముల యజమానులైన జమీందార్లు, దేశ్‌ముఖ్‌లు) ఆగడాలకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటం చేస్తూ తిరగబడ్డ ఘన చరిత్ర మరిచిపోలేనిది. నాటి స్వతంత్ర భారత హోంశాఖ మంత్రి సర్దార్ వల్లాబ్ బాయి పటేల్ చొరవతో 13 - 17 సెప్టెంబర్ 1948 మధ్య 30,00 మంది భారత సైన్యం (పోలీస్ ఆక్షన్) 'ఆపరేషన్ పోలో'ను ప్రయోగించి దండయాత్ర చేయడంతో నిజాం (పాలనలోని 20,000 నిజాం సైన్యం, దాదాపు 2 లక్షల రజాకార్లు/అరబ్స్/రోహిల్లాస్/పఠాన్స్/ఉత్తర భారత ముస్లిమ్స్) పాలకులు ఓటమిని అంగీకరించడం, 17 సెప్టెంబర్ 1948న నిజాం దుర్మార్గ పాలనకు చర్మ గీతం పాడడం, నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ నేతృత్వ పాలకులు తోక ముడవడం చకచక జరిగి పోయాయి.

1941 గణాంకాల ప్రకారం నిజాం ఆర్మీలో 53 శాతం ముస్లిం సైనికులు ఉండగా, 1,765 మంది ఆర్మీ అధికారుల్లో 1,268 మంది వరకు ముస్లిమ్‌లు ఉండేవారు.

నాటి నిజాం పాలనలో ఉన్న 9 తెలుగు మాట్లాడే తెలంగాణ జిల్లాలు, కర్నాటకకు చెందిన గుల్బర్గా ప్రాంతపు 4 కన్నడ జిల్లాలు, మరాటీ మాట్లాడే మహారాష్ట్రకు చెందిన ఔరంగాబాదు ప్రాంత 4 జిల్లాలు తీవ్రమైన హింసాయుత నిజాం పాలనను అనుభవించాయి. 1978లో రంగారెడ్డి జిల్లా ఏర్పడడంతో తెలంగాణలో 10 జిల్లాలు అయ్యాయి. తెలంగాణ ఏర్పడిన తరువాత నేడు 33 జిల్లాలతో పాలన సాగుతోంది. నాటి బహుభాషల హైదరాబాదు స్టేట్‌లో 48 శాతం తెలుగు ప్రజలు, 26 శాతం మరాఠీలు, 12 శాతం కన్నడీలు, 10 శాతం ఉర్దూ మాట్లాడే వారు ఉండే వారు. హైదరాబాదు స్టేట్ భారత్‌లో విలీనం కానట్లయితే ఈ ప్రాంతం పెద్ద శాశ్విత సమస్యగా మారుతుందని సర్దార్ పటేల్‌తో పాటు నాటి న్యాయశాఖ మంత్రి బి ఆర్ అంబేద్కర్ కూడా అభిప్రాయపడడం జరిగింది. హైదరాబాదు స్టేట్ నిజాం పాలకుల పట్ల వ్యతిరేకత వ్యక్తం చేస్తూ బలవంతంగా లొంగదీసుకునే చర్యలు తీసుకున్నట్లయితే ముస్లిం సమాజం నుంచి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉ ంటుందని మహమ్మద్ అలీ జిన్నా హెచ్చరించడం జరిగినట్లు చారిత్రక రుజువులు ఉన్నాయి. నాటి నిజాం పాలకులు స్వతంత్ర దేశంగా ఉంటామని బ్రిటీష్ పాలకులతో పాటు ఐరాస సహాయాన్ని కూడా అర్థించడానికి విఫలయత్నం చేశారు. దీనికి లార్డ్ మౌంట్ బాటెన్ అంగీకరించక పోవడం, భారత ప్రభుత్వం హైదరాబాదు స్టేట్ సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించడంతో జరిగింది.

తెలంగాణ నిజాం పాలన నుంచి విముక్తమైన భారత్‌లో విలీనమైన తరువాత తొలి ప్రభుత్వంగా ఉన్నత అధికారి యం. కె. వెల్లోడి తొలి ముఖ్యమంత్రిగా 26 జనవరి 1950న రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడింది. 1952లో ప్రజాస్వామ్యయుతంగా డా: బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా 1952లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడితెలంగాణ స్వతంత్ర వాయువులను పీల్చడం జరిగింది. 1952లో తెలుగు మాట్లాడే 22 జిల్లాల్లో 9 నిజాం పాలితో హైదరాబాదు ప్రాంతంలో ఉండగా 12 జిల్లాలు మద్రాస్ ప్రెసిడెన్సీ లేదా నేటి ఆంధ్ర ప్రాంతంలో ఉండగా, మరొక జిల్లా ఫ్రెంచ్ పాలిత యానాంగా ఉండేవి. పొట్టి శ్రీరాములు కృషితో మద్రాస్ స్టేట్ నుంచి విడిపోయిన ఆంధ్ర రాష్ట్రం 1953లో కర్నూల్ కేంద్రంగా ఏర్పడింది. భాషాప్రయుక్త రాష్ట్రాల భావనతో ఆంధ్ర, తెలంగాణను కలిపి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడం, ఆంధ్రప్రాంత ముఖ్యమంత్రుల అన్యాయ పాలనకు గురైన తెలంగాణ వాసులు 'నాన్ ముల్కీ', 'గోంగూర గో బ్యాక్' అంటూ నినదిస్తూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు సుదీర్ఘ పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్న విషయం మనందరికి తెలుసు.

సుదీర్ఘ పోరాట నేపథ్యంలో 15 ఆగష్టున భారతమాతకు స్వాతంత్ర్యం సిద్ధించాగా, తెలంగాణ రాష్ట్రానికి మాత్రం 17 సెప్టెంబర్‌న పోలీస్ ఆక్షన్‌తో విమోచన లభించడం జరిగిందని చెప్పుకోవడానికి వెనుకంజ వేస్తున్న వర్గాల స్వార్థ రాజకీయాలను సామాన్య జనం గమనిస్తూనే ఉన్నారు. తెలంగాణ విమోచనతో భారత్‌లో విలీనం, విలీనంతో జాతి సమైక్యత సుసాధ్యం కావడం జరిగి పోయాయని గమనిస్తే తెలంగాణ జాతికి మంచిది. చరిత్రను మరిచి, వక్రీకరించే వక్ర బుద్ధులను కర్రుతో వాత పెట్టాల్సిందే, వారి దుర్నీతిని బట్టబయలా చేయాల్సిందే. ఎన్నో త్యాగాల పునాదుల మీద ఏర్పడిన యువ తెలంగాణ రాష్ట్రం భారతంలో దేదీప్యమానంగా, సస్యశ్యామలంగా, శాంతియుతం సహజీవనంతో వెలగాలని కోరుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# శాఖాపరమైన అధికారులు దేశంలో ప్రతి ఇంటికి అనుసంధాతను నిర్ధారించి, కవరేజ్ నాణ్యతను మెరుగు పరచాలి - శ్రీ అశ్విని వైష్ణవ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: దేశంలోని ప్రతి ఇంటికీ అనుసంధానతను నిర్ధారించి, కవరేజ్ నాణ్యతను మెరుగుపరిచే ఉమ్మడి లక్ష్యాల సాధనకు నియంత్రణ నుంచి అభివృద్ధి వరకు శాఖాపరమైన అధికారుల ఆలోచనా విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు రైల్వేల మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ అన్నారు.

నిన్న ఇక్కడ నిర్వహించిన క్షేత్ర స్థాయి అధికారులు, శాఖాపరమైన ప్రధాన కార్యాలయ అధికారులు, పరిశ్రమ ప్రతినిధుల రెండు రోజుల సదస్సునుద్దేశించి ఆయన ప్రసంగించారు. కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి శ్రీ దేవుసిన్హ్ చౌహాన్ ఈ సమావేశాన్ని ప్రారంభించారు. టెలికాం రంగానికి సంబంధించిన వివిధ సమయోచిత సమస్యలపై సంయుక్త భాగస్వాములు, కార్యనిర్వాక బృందాల ఫలితాలు, సిఫార్సులను ఉదయం జరిగిన సదస్సులో కమ్యూనికేషన్ల శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ కు, మధ్యాహ్నం జరిగిన సదస్సులో కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి కీ సమర్పించారు.

సార్వత్రిక డిజిటల్ చేరిక లో నాణ్యమైన టెలికాం కనెక్టివిటీ యొక్క ప్రాముఖ్యతను ముఖ్యంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ పరంగా ప్రాముఖ్యతను శ్రీ అశ్విని వైష్ణవ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

క్షేత్ర స్థాయి లోనూ, ప్రధాన కార్యాలయాలలోనూ పనిచేసే శాఖాపరమైన అధికారులు, అదేవిధంగా పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సహకారం మాత్రమే మారుతున్న సాంకేతిక స్వభావంతో టెలికాం రంగాన్ని ముందుకు తీసుకెళ్లగలదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న పాతకాలపు టెలికాం చట్టాల స్థానంలో పటిష్టమైన, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఉండే టెలికాం చట్టం అవసరం ఉందని పేర్కొంటూ, దీనికి సంబంధించిన ముసాయిదా చట్టాన్ని, ప్రజల సంప్రదింపులు / సూచనలు, స్పందనల కోసం త్వరలో పబ్లిక్ డొమైన్ లో అందుబాటులో ఉంచనున్నట్లు కూడా ఆయన తెలియజేశారు.

అంతకుముందు, సదస్సును ప్రారంభించిన అనంతరం శ్రీ దేవుసిన్హ్ చౌహాన్ మాట్లాడుతూ, ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ దిశగా దేశం పురోగమించడంలో టెలికాం పాత్ర ను ప్రముఖంగా పేర్కొన్నారు. ఇటీవల విజయవంతంగా నిర్వహించిన 5-జి. వేలం మరియు ఇతర టెలికాం సంస్కరణల విషయంలో టెలికాం విభాగంతో పాటు, ఇతర భాగస్వాములందరినీ, ఆయన అభినందిస్తూ, టెలికాం విభాగాన్ని మరింత వృద్ధి లోకి తీసుకు వెళ్ళడానికి అమలు చేయగల ఆలోచనలు, పరిష్కారాలను ఈ సదస్సు రూపొందిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. టెలికాం రంగంలోని సంబంధిత సమస్యలపై ఫోకస్డ్ గ్రూప్ డిస్కషన్ లు మరియు ప్రెజెంటేషన్ల తో ఈ సదస్సు 2022 సెప్టెంబర్, 15వ తేదీన కూడా కొనసాగుతుంది.

# ఏపీలో బిజెపి కీలకంగా మారబోతోంది- ఏపీకి అమరావతే రాజధాని- సీఎం రమేష్

అమరావతి, సెప్టెంబర్ 16: ఆంధ్రప్రదేశ్ లో భారతీయ జనతా పార్టీ కీలకంగా మారబోతోందని ఆపార్టీనేత,రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్ పేర్కొన్నారు. ఏపీలో అవినీతి అక్రమాలు,ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పోరాటాలు సాగిస్తామన్నారు.శుక్రవారం కడపలోని ఆర్ ఏబి అతిథి గృహంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ..సీఎం జగన్ ప్రభుత్వంపై మండిపడ్డారు.రాష్ట్రంలో

శాంతిభద్రతల తీవ్రంగా మారాయని,మట్కా, గుట్కా వ్యాపారం జోరుగా సాగుతోందని ఆరోపించారు.అభివృద్ధి పరంగా చూస్తే ఆయన సొంత జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్న హామీ ఏమైందన్నారు.మూడేళ్లైనా అతీగతీ లేకుడాపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 67శాతం సబ్సిడీ ఇస్తుంటే రైతులకు డ్రిప్ సౌకర్యం కల్పించకపోవడం సిగ్గు చేటన్నారు.గ్రామ పంచాయతీ నిధులను ఇతర పథకాలకు మళ్లించడంపై వైసీపీ సర్పంచ్ లలోనే వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. రాష్ట్రంలో వైసీపీ నేతలు అభివృద్ధి చెందారే తప్ప.. అభివృద్ధి చేసింది శూన్యమన్నారు.రాష్ట్రంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టడం తగదన్నారు. ఆంధ్రప్రదేశ్ కు అమరావతే రాజధాని అని అన్నారు.

రాష్ట్రంలో ఐదువేల గ్రామల్లో ప్రజా పోరు నిర్వహిస్తామన్నారు.అమిత్ షా ఆద్వర్యంలో పెద్ద సభ ఏర్పాటు చేయనున్నామని సీఎం రమేష్ తెలిపారు. బీజేపీని బలపరిచే దిశగా ప్రజాపోరుతో చైతన్యం తీసుకోస్తాం అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో ఫ్లైఓవర్ లు నిర్మిస్తే వాటిని రాష్ట్ర ప్రభుత్వం చేసినట్లు చెప్పుకోవడానికి సిగ్గులేదా అని ప్రశ్నించారు. ఏపీలో మీరేం అభివృద్ధి చేశారో చెప్పగలరా అంటూ మంత్రులకు, ఎమ్మెల్యేలకు సవాల్ విసిరారు.



# మేకింగ్ ది జీరో కార్బన్ ట్రాన్సిషన్ ఇన్ బిల్డింగ్స్‌పై మూడు రోజుల 'అంగన్ 2.0' అంతర్జాతీయ సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: "మేకింగ్ ది జీరో కార్బన్ ట్రాన్సిషన్ ఇన్ బిల్డింగ్స్" పేరుతో మూడు రోజుల అంతర్జాతీయ సమావేశం అంగన్ 2.0. (ఆగ్మెంటింగ్ నేచర్ బై గ్రీన్ అఫర్డబుల్ న్యూ-హాబిటాట్) రెండవ ఎడిషన్ 14 సెప్టెంబర్ 2022న ప్రారంభమైంది. విద్యుత్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అలోక్ కుమార్ సదస్సును ప్రారంభించారు. విద్యుత్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ అజయ్ తివారీ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇండో స్విస్ బిల్డింగ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ప్రాజెక్ట్ (బీఈపీ) కింద స్విస్ ఏజెన్సీ ఫర్ డెవలప్‌మెంట్ ఌ కోఆపరేషన్ (ఎస్‌డిసి) సహకారంతో విద్యుత్ మంత్రిత్వ శాఖ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) ఈ అంగన్ 2.0.ను నిర్వహిస్తోంది.

ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అజయ్ మాథుర్, ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ ఎనర్జీ ఎఫిషియెన్సీ హెడ్ డాక్టర్ బ్రియాన్ మదర్‌వే, డాక్టర్ రిచర్డ్ డి డియర్, యూనివర్శిటీ ఆఫ్ సిడ్నీ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, డిజైన్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్‌తో సహా 75 మంది ప్రముఖ వక్తలు సదస్సులో పాల్గొంటున్నారు. 15 కంటే ఎక్కువ దేశాలు మరియు అంతర్జాతీయ సంస్థలు, 8 ప్లీనరీ మరియు 8 థీమాటిక్ సెషన్‌లలో ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించడం, భవనాల నుండి కార్బన్ ఉద్గారాలను తగ్గించడం వంటి సమస్యలపై చర్చించడానికి సమావేశమయ్యాయి.

స్విస్ ఏజెన్సీ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ కోఆపరేషన్ హెడ్ జోనాథన్ డెమెంగే, ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ ఎనర్జీ ఎఫిషియెన్సీ హెడ్ డాక్టర్ బ్రియాన్ మదర్‌వే, భారత్, భూటన్‌లో స్విట్జర్లాండ్ రాయబారి డాక్టర్ రాల్ఫ్ హెక్‌నర్ వంటి ప్రముఖులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు.

బీఈఈ మొదటి నేషనల్ ఎనర్జీ ఎఫిషియెన్సీ రోడ్‌మ్యాప్ ఫర్ మూవ్‌మెంట్ టూ అఫర్డబుల్ అండ్ నేచురల్ హాబిట్ (నిర్మన్) అవార్డుల విజేతలను ఈరోజు సత్కరించారు.బీఈఈ ఎకో నివాస్ సంహిత (ఈఎన్‌ఎస్) మరియు ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసిబీసి)కి అనుగుణంగా ఉన్న ఆదర్శప్రాయమైన బిల్డింగ్ డిజైన్‌లను గుర్తించి ప్రోత్సహించే లక్ష్యంతో ఈ అవార్డులు ఏర్పాటు చేయబడ్డాయి. జమ్మూ ఌ కాశ్మీర్ నుండి అండమాన్ ఌ నికోబార్ దీవుల వరకు దేశవ్యాప్తంగా నిర్మాణ ప్రాజెక్టులలో భాగస్వామ్యం నిర్మాన్ అవార్డులో కనిపించింది. ఆర్కిటెక్ట్‌లు, ఇంజనీర్లు, బిల్డర్లు, బిల్డింగ్ మెటీరియల్ పరిశ్రమలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పరిశోధకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కూడిన 500 మందికి పైగా ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతున్నారు.

2070 నాటికి భారతదేశాన్ని నికర జీరోగా మార్చాలనే సంకల్పంతో గ్లాస్గోలోని కాప్-26లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రతిపాదించిన లైఫ్ (జీవనశైలి,పర్యావరణం) మరియు పంచామృతం గురించి ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడం ఈ సదస్సు లక్ష్యం. నిర్మాణ రంగంలో వర్తించే వివిధ తక్కువ కార్బన్ ఉత్పత్తులు, సాంకేతికతలు మరియు ఆవిష్కరణల ప్రదర్శన ఇందులో ఉంది.

ఇంధన సమర్థవంతమైన మరియు తక్కువ కార్బన్ భవనాల కోసం వినూత్న సాంకేతికతలు మరియు పరిష్కారాలను అందించే అనేక కంపెనీల సిఈఓలు ఈ సమావేశంలో ప్రసంగించారు. అలాగే దాదాపు 20 కంపెనీలు తమ ఉత్పత్తులు మరియు సేవలను ప్రదర్శించాయి. వీటిలో తక్కువ కార్బన్ నిర్మాణ వస్తువులు, కదిలే షేడింగ్ సిస్టమ్‌లు, శక్తి సమర్థవంతమైన స్పేస్ కూలింగ్ టెక్నాలజీలు వీటిలో ఉన్నాయి. ఈ కాన్ఫరెన్స్ కమ్ ఎగ్జిబిషన్ జాతీయ మరియు అంతర్జాతీయ వ్యూహాత్మక సహకారం, భాగస్వామ్యం, నెట్‌వర్క్ మరియు సమాచార మార్పిడిని ప్రోత్సహిస్తుంది.

"తక్కువ కార్బన్ భవనాలకు అన్‌లాకింగ్ ఫైనాన్స్" నివాస భవనాలలో థర్మల్ కంఫర్ట్ మరియు క్లైమేట్ రెసిలెన్స్" వంటి క్లిష్టమైన అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. అలాగే "రిసోర్స్ ఎఫిషియన్సీలో మహిళలు" అనే అంశంపై ప్రత్యేక సెషన్లు ఉన్నాయి.

ఇండో స్విస్ బిల్డింగ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ప్రాజెక్ట్ (బిఈఈపి) అనేది భారత్, స్విట్జర్లాండ్ ప్రభుత్వాల మధ్య ఒక సహకార ప్రాజెక్ట్. పర్యావరణ-నివాస్ సంహిత (నివాస భవనాలకు ఇంధన సంరక్షణ )తో పాటు సుమారు 50 భవనాల రూపకల్పన మరియు 5000 మందికి పైగా భవన నిర్మాణ రంగ నిపుణులకు శిక్షణ ఇవ్వడంలో బిఈఈకి బీఈఈపి సాంకేతిక సహాయాన్ని అందించింది.

# సమైక్యత వజ్రోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తుంది ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్




కామారెడ్డి జిల్లా 16 సెప్టెంబర్ 22(నేటి నిజం ప్రతినిధి) అందరూ సమైక్యంగా ఉండాలనే తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ర్యాలీ అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని తెలిపారు. తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ రాజరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పరిపాలన దశకు పరివర్తన చెందిన రోజు గా అభివర్ణించారు. విశాల భారత దేశంలో తెలంగాణ అంతర్భాగమైన రోజు ఇదే అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే మన రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని పేర్కొన్నారు. కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. రైతులకు పెట్టుబడి సాయం, బీమా అమలు చేస్తుందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందాయని చెప్పారు. మిషన్ కాకతీయ ద్వారా నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు పునరుద్ధరణ చేయడం వల్ల భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాల ర్యాలీకి పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు, మహిళలు, విద్యార్థులు, ప్రజలు తరలివచ్చారని తెలిపారు.

సెప్టెంబర్ 17న కామారెడ్డి కలెక్టరేట్లో ఉదయం 9 గంటలకు రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి జాతీయ పతకాన్ని ఆవిష్కరణ చేస్తారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. 18న జిల్లా కేంద్రంలో జాతీయ సమైక్యత, సమగ్రతను చాటేలా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ఉంటుందన్నారు. జిల్లాలోని స్వాతంత్ర సమరయోధులకు, కవులు, కళాకారులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ జాహ్నవి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దిన్, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, వైస్ చైర్ పర్సన్ హిందూ ప్రియ, ఎంపీపీలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరా గాంధీ చౌక్ వద్ద తెలంగాణ జాతీయ సమైక్యత ర్యాలీ



కామారెడ్డి జిల్లా 16 సెప్టెంబర్ 22 (నేటి నిజం ప్రతినిధి) కామారెడ్డి పట్టణంలోని ఇందిరా గాంధీ చౌక్ వద్ద తెలంగాణ జాతీయ సమైక్యత ర్యాలీని శుక్రవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ జెండా ఊపి ప్రారంభించారు. కామారెడ్డి నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాల నుంచి ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులు, రైతులు జాతీయ జెండాలను పట్టుకొని ర్యాలీలో ముందుకు నడిచారు. నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ చేపట్టారు. 3.5 కిలోమీటర్ల దూరం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జిల్లా అధికారులు పాల్గొన్నారు. బాన్సువాడలో రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే సురేందర్, ఎంపి బీబీ పాటిల్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, స్థానిక ప్రజాప్రతినిధులు, బిచ్కుందలో జెడ్పి చైర్ పర్సన్ శోభ, జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే , స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రూ.12 లక్షల బిల్లులు రాలేదని సర్పంచ్ వినూత్న నిరసన



అమరావతి, సెప్టెంబర్ 16: నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలో ఒక గ్రామ సర్పంచ్ వినూత్న నిరసన తెలిపారు. తనకు రావలసిన బిల్లులు దాదాపు గత రెండేళ్ళ పాటు పనులు చేసిన రూ.12 లక్షల బిల్లులు రాలేదని ఆవేదనకు గురై సర్పంచ్ వినూత్న నిరసన చేపట్టారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని వడ్డెమాను గ్రామంలో గ్రామ సర్పంచ్ రామ చంద్రుడు గ్రామ పంచాయతీలో నిధులు లేవని అభివృద్ధి పనుల కోసం గ్రామంలో భిక్షాటన చేశారు. శుక్రవారం గ్రామ సర్పంచ్ రామ చంద్రుడు ఇంటింటికి తిరిగి భిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన చేశారు.

గ్రామంలో పలు అభివృద్ధి కోసం అధిక వడ్డీలకు తెచ్చి రూ.12 లక్షలు ఖర్చు చేసి పనులు చేశామని ఇప్పటి వరకు బిల్లులు మంజూరు కాలేదన్నారు. అంతే కాకుండా గ్రామ పంచాయతీలో ఎలాంటి నిధులు లేకపోవడం వల్ల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. తాము ఖర్చు చేసిన బిల్లులు రాకపోగా నిధులు కూడా మంజూరు కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్ లను చిన్న చూపు చూస్తుందని, సర్పంచులకు ఎలాంటి నిధులు కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# 300 మీటర్ల భారీ జాతీయ జెండాతో ర్యాలీ

భూపాలపల్లి, సెప్టెంబర్ 16: తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాల సందర్భంగా జయశంకర్ జిల్లా కేంద్రంలో నలుదిక్కుల నుండి 300 మీటర్ల భారీ జాతీయ జెండాతో అంబేద్కర్ కూడలి వద్దకు మహిళలు, అధికారులు ,విద్యార్థులు తరలివచ్చారు.అంబేద్కర్ సెంటర్ వద్ద ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణ రెడ్డి, ఎంపీ పసునూరి దయాకర్, జిల్లా కలెక్టర్ భావేశ్ మిశ్రా,ఎస్పీ సురేందర్ రెడ్డి,తదితరులు జాతీయ జెండా చేతపట్టుకుని ర్యాలీ ని ప్రారంభించారు.



# ఎస్ సిఒ సమిట్ కుహాజరవడం కోసం సమర్ కంద్‌కు చేరుకొన్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఉజ్ బెకిస్తాన్ అధ్యక్షుడు శ్రీ శావ్ కత్ మిర్జియోయెవ్ ఆహ్వానించిన మీదట శంఘాయి సహకార సంస్థ (ఎస్ సిఒ) యొక్క దేశాధినేతల మండలి తాలూకు 22వ సమావేశాని కి హాజరవడం కోసం ఈ రోజు న సాయంత్రం పూట ఉజ్ బెకిస్తాన్ లోని సమర్ కంద్ కు చేరుకొన్నారు.

ప్రధాన మంత్రి సమర్ కంద్ కు చేరుకోవడంతోనే ఉజ్ బెకిస్తాన్ ప్రధాని శ్రీ అబ్దుల్లా అరిపొవ్ ఆయన కు ఆప్యాయం గా ఆహ్వానం పలికారు. విమానాశ్రయం లో ప్రధాన మంత్రి కి స్వాగతం పలకడం కోసం పలువురు మంత్రులు, సమర్ కంద్ ప్రాంతం గవర్నరు మరియు ఉజ్ బెకిస్తాన్ ప్రభుత్వం లోని ఇతర సీనియర్ అధికారులు కూడా విమానాశ్రయాని కి తరలివచ్చారు.

ప్రధాన మంత్రి రేపు ఉదయం, అంటే 2022 సెప్టెంబర్ 16వ తేదీ నాడు ఎస్ సిఒ సమిట్ లో పాలుపంచుకోవడం తో పాటు గా ఉజ్ బెకిస్తాన్ అధ్యక్షుని తో మరియు శిఖర సమ్మేళనాని కి హాజరు అవుతున్నటువంటి నాయకుల లో కొందరు నేతల తో ద్వైపాక్షిక సమావేశాల లో కూడా పాల్గొంటారు.

# శ్రీవారిని కుటుంబసమేతంగా దర్శించుకున్న క్రీడాకారిణి పీవీ సింధూ



తిరుపతి, సెప్టెంబర్ 16: ప్రముఖ క్రీడాకారిణి పీవీ సింధూ తిరుమల శ్రీనివాసుడిని దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు చేరుకున్న సింధూ విఐపి బ్రేక్ ప్రారంభ దర్శన సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనాంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనం పలకగా.. ఆలయ అధికారులు స్వామి వారి వస్త్రంతో సత్కరించి శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామి వారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా వుందని..కాలికి గాయం కావడంతో విశ్రాంతి తీసుకుంటున్నానని..వచ్చే ఏడాది పలు టోర్నమెంట్లలో పాల్గొంటానని సింధూ తెలిపారు.

# రాష్ట్రంలో మళ్లీ వైసీపీ ఘన విజయం సాధించడం ఖాయం.. విశాఖ ఎంపీ



తిరుమల, సెప్టెంబర్ 16: రాబోవు ఎన్నికల్లో మూడు రాజధానుల అంశాన్ని మేనిఫెస్టోలో చేరుస్తామని.. తిరిగి రాష్ట్రంలో వైసీపీ ఘన విజయం సాధిస్తుందని విశాఖ ఎంపీ సత్యనారాయణ జోస్యం చెప్పారు. నేడు తన జన్మదినం కావడంతో స్వామి వారీ ఆశీస్సులు పొందేందుకు కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు చేరుకున్న ఆయన విఐపి బ్రేక్ ప్రారంభ దర్శన సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనాంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనం పలకగా ఆలయ అధికారులు స్వామి వారి వస్త్రంతో సత్కరించి శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ? రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పరిపాలనను వికేంద్రీకరించాలని జగన్ సంకల్పించి.. రాష్ట్రంలో మూడు రాజధానులు ఏర్పాటు చెయ్యాలని జగన్ నిర్ణయం తీసుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన 6నెలల్లోనే మూడు రాజధానులపై ప్రభుత్వం ప్రకటన చేసిందన్నారు. మూడు రాజధానుల ఏర్పాటును కొన్ని శక్తులు అడ్డుకుంటున్నాయని.. ఎవరు అడ్డుకున్నా మూడు రాజధానులు ఏర్పాటు చేస్తామన్నారు. మూడు రాజధానుల బిల్లును త్వరలోనే తిరిగి అసెంబ్లీలో ప్రవేశ పెడుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉన్నత విద్యనందించేందుకు ప్రభుత్వం విద్యాలయాల్లో మార్పులు చేసిందన్నారు.

# లబ్ధిదారులకు పింఛన్ గుర్తింపు కార్డులు అందజేత

హైదరాబాద్, సెప్టెంబర్ 16: అర్హులందరికీ ఆసరా పింఛన్లు అందజేస్తామని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తెలిపారు. గురువారం శంషాబాద్ పట్టణంలోని మల్లిక కన్వేషన్ హాల్‌లో వృద్ధాప్య, వితంతు పింఛన్ల లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట తప్పకుండా 57 సంవత్సరాలు నిండిన వారికి నూతన పింఛన్లు మంజూరు చేశారని తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 494 మంది లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డులను అందజేశారు. పేదల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని వెల్లడించారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్ ప ర్సన్ కొలన్ సష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, ఎన్ఎంసీ చైర్మన్ వెంకటేశ్ గౌడ్, కౌన్సిలర్లు కుమార్, జాంగీర్‌ఖాన్, అజేయ్, చెన్నం అశోక్, ప్రవీణ్‌గౌడ్, శ్రీకాంత్ యాదవ్, బండి భాగ్యలక్ష్మి, అమృతారెడ్డి, లక్ష్మీగౌడ్, మేకల వెంకటేశ్,భారతమ్మ, కమిషనర్ సాబేర్ అలీ, మాజీ ఎంపీటీసీ బండిశ్రీకాంత్‌యాదవ్, మంచర్ల శ్రీనివాస్, పెదిరిపాటి ప్రవీణ్‌గౌడ్, మురళీయాదవ్, రాజేందర్, ప్రభాకర్,నాయకులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీకి అందించిన 1200కు పైగా ప్రతిష్టాత్మకమైన ప్రారంభమైన ఇ-వేలం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీకి అందిన ప్రతిష్టాత్మక, చిరస్మరణీయ జ్ఞాపికలు/ బహుమతుల ఇ-వేలం నాలుగో ఎడిషన్‌ను నిర్వహిస్తోంది. ఇది 17 సెప్టెంబర్ న ప్రారంభమై అక్టోబర్ 2, 2022 వరకు ఆన్‌లైన్ వేదికగా కొనసాగనుంది.

కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మరియు ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి 17వ తేదీన ప్రారంభం కానున్న ఇ- వేలం గురించి వివరించారు. సాంస్కృతిక, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘవాల్ మరియు సాంస్కృతిక, విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీమతి మీనాక్షి లేఖి ఈ సమావేశంలో ఉన్నారు.

కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ, “2019లో ఈ వస్తువులను ప్రజల కోసం బహిరంగ వేలం వేయడం జరిగింది. ఆ సమయంలో మొదటి రౌండ్‌లో 1805 బహుమతులు, రెండవ రౌండ్‌లో 2772 బహుమతి వస్తువులను వేలానికి ఉంచారు. 2021లో, సెప్టెంబర్‌లో 1348 వస్తువులతో ఇ-వేలం నిర్వహించబడింది. ఈ ఏడాది సుమారు 1200 జ్ఞాపికలు, బహుమతి వస్తువులను ఈ-వేలంలో ఉంచారు. దిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్‌లో మెమెంటోల ప్రదర్శన జరిగింది. ఈ వస్తువులను వెబ్‌సైట్‌లో కూడా చూడవచ్చు”.

వేలంలో ఉన్న జ్ఞాపికల్లో సృజనాత్మక పెయింటింగ్‌లు, శిల్పాలు, హస్తకళలు మరియు జానపద కళాఖండాలు ఉన్నట్లు కేంద్రమంత్రి శ్రీ జి కిషన్ రెడ్డి తెలిపారు. వీటిలో సంప్రదాయ అంగవస్త్రాలు, శాలువాలు, తలపాగాలు, ఉత్సవ కత్తులు వంటి బహుమతులుగా అందించబడే వస్తువులు కూడా ఉన్నట్లు తెలిపారు. అయోధ్యలోని శ్రీరామ మందిరం మరియు వారణాసిలోని కాశీ-విశ్వనాథ దేవాలయం యొక్క ప్రతిరూపాలు మరియు నమూనాలు ఆసక్తిని కలిగించే ఇతర జ్ఞాపికల్లో ఉన్నట్లు తెలిపారు. వివిధ క్రీడాకారులు గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికి అందించిన పలు ఉత్తేజకరమైన జ్ఞాపికలు ఈ వేలంలో ఉన్నట్లు తెలిపారు. 2022 లో నిర్వహించిన కామన్వెల్త్ క్రీడలు, డెఫ్లింపిక్స్ 2022 మరియు థామస్ కప్ ఛాంపియన్‌షిప్ 2022లో భారత జట్టు అద్భుత ప్రదర్శన చేసి చరిత్రలో స్థానం సాధించిపెట్టిందని కేంద్ర మంత్రి అన్నారు. క్రీడా జట్లు మరియు క్రీడా కార్యక్రమాల విజేతలు సమర్పించిన జ్ఞాపికలు వేలంలో ఉన్నయని ఆయన అన్నారు. ఈ వేలంలో 25 కొత్త క్రీడా జ్ఞాపికలు ఉన్నాయని మంత్రి వెల్లడించారు.

నమామి గంగే ద్వారా దేశం యొక్క జీవనాడి అయిన గంగా నదిని పరిరక్షించే గొప్ప ఉద్దేశ్యం కోసం గౌరవ ప్రధానమంత్రి తనకు లభించే బహుమతులన్నింటినీ వేలం వేయాలని నిర్ణయించట్లు కేంద్రమంత్రి తెలిపారు. ఇలాంటి నిర్ణయం తీసుకున్న భారత మొట్టమొదటి ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. ప్రతి ఒక్కరూ వేలంలో పాల్గొని గొప్ప మిషన్‌కు సహకరించాలని ఆయన ప్రజలను కోరారు.

”గత వేలంపాటలో దేశంలోని ప్రతి ప్రాంతం నుండి ప్రజలు చురుకుగా పాల్గొన్నట్లు ఈ సందర్భంగా శ్రీ అర్జున్ రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీకి అందజేసిన ప్రతిష్టాత్మకమైన, చిరస్మరణీయమైన జ్ఞాపికల వేలంలో ఈ ఏడాది కూడా పాల్గొనాలని ప్రజలను మంత్రి కోరారు.

కేంద్రమంత్రి శ్రీమతి మీనాక్షి లేఖీ మాట్లాడుతూ, ప్రధానమంత్రికి అందించిన వివిధ జ్ఞాపికల ప్రాముఖ్యతను, నమామి గంగే ప్రాజెక్టుకు ఈ వేలం పాటలో పాల్గొనడం ద్వారా అందించే సహకారాన్ని వివరించారు.

సందర్శనను మరింత సులభతరంగా మార్చేందుకు, సాధారణంగా గైడెడ్ టూర్లు మరియు వినికిడి లోపం ఉన్నవారి కోసం సంకేత భాషలో గైడెడ్ టూర్లు ఏర్పాటు చేయబడ్డాయి. దృష్టిలోపం ఉన్నవారి కోసం బ్రెయిలీలో కేటలాగ్‌లు కూడా అందుబాటులో ఉంచబడ్డాయి. ప్రదర్శన ప్రాంతం 17 సెప్టెంబర్ నుండి అక్టోబర్ 2 వరకు ప్రజలందరికీ ఉచితంగా అందుబాటులో ఉంటుంది. వేలం ద్వారా సేకరించిన మొత్తాన్ని జాతీయ నది అయిన గంగా నదిని పరిరక్షించడానికి, పునరుజ్జీవింపజేయడానికి ఉద్దేశించిన ప్రతిష్టాత్మక కార్యక్రమం అయిన నమామి గంగే కార్యక్రమానికి ఉపయోగించనున్నారు.

# అంగరంగ వైభవంగా తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ కార్యక్రమాలు

## - జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన మంత్రి పువ్వాడ
## - తరలివచ్చిన వేలాది మంది ప్రజలు
## - నూతన సెక్రటేరియట్ కు అంబేడ్కర్ పేరు పెట్టడం చారిత్రాత్మకం
## - సభలో మాట్లాడిన మంత్రి పువ్వాడ

ఖమ్మం, సెప్టెంబర్ 16 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ఖమ్మం జిల్లా కేంద్రంలో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్, అదనపు కలెక్టర్ మధుసుధన్, స్నేహలత, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ సురభి, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ లు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, రైతులు తదితరులు ఉన్నారు.

ఖమ్మం జడ్పీ సెంటర్ వద్ద జెండా ఊపి ర్యాలీని లాంచనంగా ప్రారంభించి పాల్గొన్నారు.

జడ్పీ సెంటర్ నుండి ప్రారంభమైన ర్యాలీలో భారీగా హాజరైన జనంతో కలిసి కలెక్టరేట్, టీటీడీసీ, ఇల్లందు సర్కిల్, పటేల్ స్టేడియం మీదగా ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ కళాశాలకు చేరుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి పువ్వాడ మాట్లాడారు.



భారతదేశానికి ఆగస్టు 15, 1947 న వచ్చిందని, నాటి నుండి వచ్చిన అనేక మంది పాలకులు మన తెలంగాణ ఔన్నత్యాన్ని నేటి వరకు గుర్తించలేకపోయారు అన్నారు.

ఇటీవలే భారతదేశ స్వాతంత్ర్య వజ్రోత్సవాలు 15 రోజుల పాటు ఘనంగా జరుపుకున్నామని, మన ప్రాంతానికి స్వాతంత్ర్యం వచ్చిన రేపటి సెప్టెంబర్ 17 నుండి తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాలను సంవత్సరం పాటు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

ఇది తెలంగాణ రాష్ట్ర ప్రజల పండుగ అని, ఇది కేవలం ఒక కులానికో మతానికో సంబంధించినది కాదన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేవలం ఎనిమిది సంవత్సరాలు మాత్రమే, అయినా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సమర్థ నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోని మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు.

దేశం నివ్వెరపోయేలా ప్రగతి సాగిస్తున్నదని, ప్రక్కనున్న మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల ప్రజలు తమను తెలంగాణ రాష్ట్రంలో కలపాలని అనేక విజ్ఞప్తులు వస్తున్నాయని వివరించారు.

రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరంటు ఉన్నాయని, మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు జరుగుతున్నాయని అన్నారు.

ఇతర రాష్ట్రాలలో కరువు పరిస్థితులు ఉన్నాప్పటికి వరి ధాన్యం పండించడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచిందన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఈమధ్యనే నూతనంగా మరో 10 లక్షల పెన్షన్లు మంజూరు చేశారని అన్నారు.

రాష్ట్రంలో కోటి ఐదు లక్షల కుటుంబాలు ఉంటె, దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో 45 లక్షల మంది పేదలకు పెన్షన్లను అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటే అన్నారు.

మిగతా రాష్ట్రాలలో రూ.500, రూ.1000 అందిస్తే మన రాష్ట్రంలో రూ.2000, రూ.3000 అందిస్తున్నామని, బీడీ, బొదకాలు, డయాలిసిస్ రోగులకు కూడా పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం మనది అని అన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు 230 గా ఉన్న గురుకుల పాఠశాలలను 1000 కి పెంచడం జరిగిందని, ప్రైవేట్ కు ధీటుగా ప్రభుత్వ విద్యను అందిస్తున్నామని, ఎన్నడు లేని విధంగా ప్రభుత్వ పాఠశాల, కళాశాలలలో సీట్ల కోసం ఎమ్మెల్యేల సిఫారసు లెటర్ లు తీసుకునే స్థాయికి వచ్చామని అన్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా ఉన్నామని, తెలంగాణ రాష్ట్రంలో అందరూ సంతోషంగా ఉండాలనేదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు.

రాష్ట్రంలో సంపదను పెంచి ప్రజలకు పంచుతున్నామని, 65 లక్షల మంది రైతులకు రూ.15 వేల కోట్లు రైతుబంధు,45 లక్షల మందికి ఆసరా పెన్షన్ ల ద్వారా రూ.15 వేల కోట్లు అందిస్తున్నామన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ల ద్వారా రూ. 9 వేల కోట్లను 13 లక్షల మందికి అందజేశామని, కేసీఆర్ కిట్ 11 లక్షల మందికి దాదాపు రూ.6వేల కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు.

మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ త్రాగునీరు అందిస్తున్నామని, ఒక్క ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోనే రూ.300 కోట్ల రూపాయలతో ఇంటింటింటి నల్లాల ద్వారా శుద్ధమైన త్రాగునీరు అందిస్తున్నామన్నారు.

తెలంగాణ రాష్ట్ర కొత్త సెక్రటేరియట్ కు రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ అంబేడ్కర్ పేరు పెట్టుకుని వారిని గౌరవించుకున్నామన్నారు. వారి పేరును నూతన సెక్రటేరియట్ కు పెట్టడం చారిత్రాత్మక నిర్ణయమని అందుకు కేసీఆర్ కి కృతజ్ఞతలు తెలిపారు.

భారత పార్లమెంట్ కు కూడా అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేశామని అన్నారు.

# అంబలి కేంద్రాల తెలంగాణను దక్షిణ భారత ధాన్యాగారంగా మార్చుకున్నాం : మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట, సెప్టెంబర్ 16: ఒక్కప్పుడు పొట్టకూటి కోసం దుబాయి పోయి బతికితే ఇవాళ ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు కూలీ కోసం వలస వస్తున్నారు. అంబలి కేంద్రాల తెలంగాణ నుంచి ఎనిమిదేండ్లలో దక్షిణ భారత ధాన్యగారంగా తెలంగాణను మార్చుకున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు.



శుక్రవారం సిద్దిపేట హైస్కూల్ గ్రౌండ్‌లో తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవ వేడుకల బహిరంగ సభకు హాజరై మాట్లాడారు. 75 ఏండ్ల కింద మనం రాచరిక పాలనలో ఉన్నాం. ఎంతో మంది తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారన్నారు.

1969లో తెలంగాణ ఉద్యమం కోసం పోరాటం జరిగింది. ఎప్పటి కప్పుడు రాచరిక, పెత్తందార్ల పెత్తనాన్ని ఈ గడ్డ తిప్పి కొట్టింది. యావత్ తెలంగాణ ప్రజానీకం సకల జనుల సమ్మెతో ఢిల్లీని గడగడలాడించి తెలంగాణ సాధించాం. ఈ మధ్య కొన్ని శక్తులు కుల, మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నాయి.

మతాల పేరిట విద్వేషాలు రెచ్చగొట్టే వారికి అధికారం పోతే అభివృద్ధి కుంటు పడుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఒక్క ఎకరం పారలేదని హైదరాబాద్, ఢిల్లీ కేంద్రంగా మాట్లాడే కొంత మంది నాయకుల అజ్ఞానం చూస్తే జాలి వేస్తుందన్నారు. దేశం మొత్తం తెలంగాణను చూసి నేర్చుకుంటున్నది. నవ తెలంగాణ నిర్మాణం కోసం మనం ముందుకు సాగాలని మంత్రి పిలుపునిచ్చారు.

# కృష్ణ జిల్లాలో విషాదం.. పూడికతీతకు వెళ్లి నలుగురు మృత్యువాత

అమరావతి, సెప్టెంబర్ 16: ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ జిల్లా బంటుమిల్లి మండల కేంద్రంలో విషాదం చోటు చేసుకుంది. పాత బావి పూడికతీతకు దిగిన నలుగురికి ఆక్సిజన్ అందక మృత్యువాత పడ్డారు. జిల్లాలో కురిసిన వర్షాల తో బావిని పునరుద్ధరించుకోవడానికి ఇంటి యజమాని నలుగురు కూలీలను సంప్రదించాడు.

ఇంటి యజమాని తండ్రి, కొడుకులు వంజల రామారావు, లక్ష్మణరావులతో పాటు కూలీలు రంగా అతడికి సహాయకుడిగా శ్రీనివాసరావు పూడికతీతకు బావిలో దిగారు. కొద్దిసేపటికే వారికి ఆక్సిజన్ అందక ప్రాణాలు కోల్పోయ్యారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బావి నుంచి బయటకు తీశారు.

# పెద్దపల్లిలో భారీ సమైక్యతా ర్యాలీ..




కరీంనగర్, సెప్టెంబర్ 16:సమైక్యత వజ్రోత్సవాల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈరోజు ఐటిఐ మైదానంలో ప్రారంభమైన ర్యాలీ జూనియర్ కళాశాల మైదానం వరకు సాగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమైక్యత వజ్రోత్సవాల ర్యాలీలో జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణ, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, దీపక్, డీసీపీ రూపేష్, ఏసీపీ సారంగపాణితో పాటు నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకే జాతీయ పార్టీల కుట్రలు : మండలి చైర్మన్ గుత్తా



నల్లగొండ, సెప్టెంబర్ 16: నేడు తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొన్ని జాతీయ పార్టీలు మళ్లీ కుట్రలకు తెరలేపాయి. తెలంగాణ ప్రజలు రాష్ట్రంలో జరుగుతున్న కుట్రలను గ్రహించాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.

తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవ వేడుకలలో భాగంగా శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు.

తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎందరో అమరుల పోరాటంతో నిజాం పాలన పోయి మనకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు.

తెలంగాణలో ఉన్న వనరులపైన కన్నేసిన ఆంధ్ర నాయకులు మన ప్రాంతంపైన కుట్ర చేశారు. ఆంధ్ర నాయకుల దోపిడీ నుండి విముక్తి కోసం 60 యేండ్లు తెలంగాణ ప్రజానీకం పోరాటం చేసిందన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు.

ఇలాంటి సమయంలో సీఎం కేసీఆర్‌కు మనం అందరం తోడుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి డా.బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టడాన్ని స్వాగతిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

# తెలంగాణ గర్వపడేలా జాతీయ సమైక్యత వజ్రోత్సవాలు : మంత్రి గంగుల



కరీంనగర్, సెప్టెంబర్ 16 (నేటినిజం ప్రతినిధి): దేశానికి స్వాతంత్ర్యం సాధించినప్పటికి సంవత్సరం ఆలస్యంగా రాష్ట్రం స్వేచ్ఛా వాయువులు సాధించిన సెప్టెంబర్ 17 ప్రపంచ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు.తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాలలో భాగంగా మంత్రి జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రజలు గర్వపడేలా జాతీయ సమైక్యత వజ్రోత్సవాలను నిర్వహించుకోవడంతో పాటు భావితరాలకు ఈ రోజు విశిష్టతను తెలియజేయాలన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలోకి అడుగుపెట్టి నేటికి 75 వసంతాలను పూర్తిచేసుకున్న శుభ సందర్భంగా తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలను నిర్వహించు కుంటున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో తెలంగాణ అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు.కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కనుమల్ల విజయ, జిల్లా కలెక్టర్ ఆర్.వి. కర్ణన్,నగర మేయర్ వై. సునీల్ రావు, పోలీస్ కమిషనర్ సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, ట్రైనీ కలెక్టర్ లెనిన్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి పాల్గొన్నారు.

# షిండే గ్రూపులో చేరిన 12 రాష్ట్రాల పార్టీ చీఫ్‌లు

ముంబై, సెప్టెంబర్ 16: శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 12 రాష్ట్రాల సేన చీఫ్‌లు మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే శిబిరంలో చేరారు. ఆయా రాష్ట్రాల్లో పార్టీ ఎదుగుదలకు అవసరమైన సాయం చేస్తామని సీఎం షిండే ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర శాఖల చీఫ్‌లకు హామీ ఇచ్చారు.షిండే గ్రూపులో చేరిన పార్టీ రాష్ట్ర చీఫ్‌ల్లో ఢిల్లీ శివసేన చీఫ్ సందీప్ చౌధరి, మణిపూర్ శాఖ అధ్యక్షుడు టొంబి సింగ్, మధ్యప్రదేశ్ చీఫ్ తదేశ్వర్ మహవర్, చత్తీస్‌ఘడ్ చీఫ్ ధనంజయ్ పరిహార్, గుజరాత్ చీఫ్ ఎస్ఆర్ పాటిల్, రాజస్థాన్ చీఫ్ లఖన్ సింగ్ పవార్, హైదరాబాద్ చీఫ్ మురారీ అన్నా, గోవా చీఫ్ జితేష్ కామత్, కర్నాటక చీఫ్ కుమార్ హకరి, బెంగాల్ చీఫ్ శాంతి దత్త, ఒడిషా చీఫ్ జ్యోతిశ్రీ ప్రసన్న కుమార్, త్రిపుర స్టేట్ ఇన్‌చార్జ్ బరివదేవ్ నాథ్ ఉన్నారు.

# ఆరోగ్య తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ కృషి : మంత్రి మల్లారెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 16: ఆరోగ్య తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని 25వ డివిజన్‌కు చెందిన చిన్నారి అనిక దవాఖానలో చికిత్స పొందుతుండగా ఆమె వైద్య ఖర్చులకోసం కార్పొరేటర్ జమాల్పూర్ నవీన్‌ను సంప్రదించారు.

వెంటనే ఆయన స్పందించి మంత్రి మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎం సహాయనిధి నుంచి రూ. 1.50లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజలు అనారోగ్యానికి గురికావొద్దని వారి ఆరోగ్యం కోసం కోట్లు ఖర్చు చేస్తున్న గొప్ప మానవతావాది సీఎం కేసీఆర్ అని అన్నారు.

టీఆర్ఎస్ హాయంలోనే రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్‌గా కొన సాగుతుం దన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో మరెక్కడాలేవన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో విపత్తుల నివారణకు ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక



తిరుమల, సెప్టెంబర్ 16: తిరుమలలో విపత్తుల నివారణకు ప్రత్యేక కార్యచరణ ప్రణాళికను రూపొందించాలని నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ అధికారులకు టీటీడీ సూచించింది. ఈ మేరకు తిరుమల అన్నమయ్య భవనంలో తిరుపతి జిల్లా, టీటీడీకి సంబంధించిన విపత్తుల నివారణ అనే అంశంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో న్యూఢిల్లీకి చెందిన ఎన్‌డీఎంఎ జాయింట్ సెక్రెటరీ కునాల్ సత్యర్థి వర్చువ ల్ విధానంలో పాల్గొన్నారు. తిరుమలకు ప్రతి రోజు 80 వేల మంది, ప్రత్యేక పర్వదినాల్లో లక్షలమంది భక్తులు వస్తుంటారని ఈవో వివరించారు.

తిరుమలలో తొక్కిసలాట, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అధిక నష్టాన్ని నివారించడానికి, ప్రకృతి నుంచి ఎదురయ్యే సవాళ్లను సాధ్యమైనంత వరకు ఎదుర్కోవడానికి గల ప్రణాళికపై చర్చించారు. తిరుమలలో 7,500 వసతి గదులు, అనేక వాణిజ్య సముదాయాలు ఉన్నాయని ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాలు, అన్నప్రసాదాల తయారీకి గ్యాస్ వినియోగించే చోట ప్రమాదాలను అరికట్టేందుకు చేపట్టవలసిన చర్యలు తెలపాలన్నారు.

అకస్మాత్తుగా సంభవించే భారీ వర్షాలు, పిడుగుల వలన కొండ చరియలు విరిగిపడటం ద్వారా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నదన్నారు. వేసవి కాలంలో శేషాచల అడవులలో సంభవించే అగ్ని ప్రమాదాలు, వడగాలుల గురించి సమావేశంలో చర్చ జరిగింది. ఇందుకు సంబంధించిన ఇబ్బందులను అధిగమించడానికి ఎన్‌డిఎంఎ ఆధ్వర్యంలో ఎస్‌ఓపీ (స్టాండర్డ్ అపరేటింగ్ సిస్టమ్) ను ఏర్పాటు చేయాలని ఈవో సూచించారు.

# మెడికల్ విద్యార్థులకు బీ-కేటగిరీలో లోకల్ రిజర్వేషన్లు: మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట, సెప్టెంబర్ 16: వైద్య విద్యార్థుల కోసం అన్ని రకాల సదుపాయాల కోసం కృషి చేస్తున్నామని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నిర్వహించిన మెడ్‌ఎక్స్‌పో కార్యక్రమంలో మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో వైద్యవిద్య కోసం ఉక్రెయిన్, రష్యాకు వెళ్లి చదువుకునే వారని చెప్పారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిందని, రాష్ట్రంలో జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు.

రాబోయే రోజుల్లో సిద్దిపేటలో రూ.15 కోట్లతో క్యాథలాబ్ గుండె చికిత్స, రేడియో థెరపీ సేవలకు అనుగుణంగా క్యాన్సర్ చికిత్స అందిస్తామన్నారు. సిద్దిపేటలో 900 పడకల దవాఖానను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. మూడేండ్ల నుంచి కరోనా వల్ల ఎక్కడా మెడ్ ఎక్స్‌పో జరగలేదని వెల్లడించారు. రానున్న రోజుల్లో బీ కేటగిరీలో లోకల్ రిజ్వేషన్లు అమలు చేస్తామని, పీజీ సీట్లను 40 వరకు పెంచుతున్నామని తెలిపారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వివిధ రాష్ట్రాల కళారూపాల ప్రదర్శన

తిరుమల, సెప్టెంబర్ 16: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవ వాహనసేవల్లో కళారూపాల ప్రదర్శనకు టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది. టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఈ కళారూపాలు భక్తులకు కనువిందు చేయనున్నాయి. ఉత్తరాదితో పాటు దక్షిణాదికి చెందిన 7 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం నుంచి కళాకారులు వాహనసేవల్లో పాల్గొననున్నారు. వాహనసేవల సమయంలో విశిష్టతను తెలియజేసేందుకు ప్రముఖ పండితులు వ్యాఖ్యానం చేయనున్నారు.

టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టు, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు, శ్రీవేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల్లో ఆధ్యాత్మిక, ధార్మిక, భక్తి సంగీత కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దక్షిణాదిలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరితో పాటు ఉత్తరాదికి చెందిన మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి వివిధ కళారూపాలు ప్రదర్శించేందుకు కళాకారులు తిరుమలకు రానున్నారు.

వాహన సేవల్లో హిందూ ధర్మప్రచార పరిషత్ నుంచి 50, దాస సాహిత్య ప్రాజెక్టు నుంచి 24, అన్నమాచార్య ప్రాజెక్టు నుంచి 14 కలిపి మొత్తం 88 కళాబృందాలు పాల్గొననున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి 63 బృందాల్లో కళాకారులు పాల్గొంటారని టీటీడీ అధికారులు తెలిపారు. తెలంగాణ నుంచి రెండు బృందాలు చెక్క భజన, కోలాటంను ప్రదర్శించనున్నారు.

# ఉస్మానియా యూనివర్సిటీలో ఆక్సిజన్ పార్క్ ప్రారంభించిన ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్




హైదరాబాద్, సెప్టెంబర్ 16: పచ్చని వాతావరణంతో ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిసరాలు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ప్రాణవాయువును అందిస్తున్నాయని రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత హారం కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ డెవలప్ మెంట్ అథారిటీ హెచ్ఎండీఏ సహకారంతో ఉస్మానియాలో ఏర్పాటు చేసిన ఆక్సీజన్ పార్క్‌ను ఓయూ ఉపకులపతి ఆచార్య డి. రవిందర్ తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ, రిజిస్ట్రార్, ఓఎస్డీతో కలిసి ఆక్సీజన్ పార్క్ లో కలియ తిరిగారు. మొమిన్ చెరువు అభివృద్ధి, ఇతర మౌళిక వసతుల కల్పనపై ప్రొఫెసర్ రవిందర్? సంతోష్ కు వివరించారు. సమగ్ర నివేదిక( డీపీఆర్) తో వస్తే ఆక్సీజన్ పార్క్ సహా ఉస్మానియా ఆవరణలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తానని ఈ సందర్భంగా వీసీకి ఎంపీ హామి ఇచ్చారు. 200 రకాల ఔషధ మొక్కలు, చెట్లతో ఆక్సీజన్ పార్క్ ను అభివృద్ధి చేశామని వీసీ ప్రొఫెసర్ డి. రవిందర్ యాదవ్ తెలిపారు.

వెయ్యికి పైగా నెమళ్లు ఈ పార్క్ లో ఉన్నాయని? వాటి సంరక్షణతో పాటు బయో డైవర్సిటీకి ఓయూ కేంద్రంగా ఉందని స్పష్టం చేశారు. హెచ్ఎండీఏ కమిషనర్ గా, ఓయూ ఇంఛార్జ్ ఉపకులపతిగా ఉన్న అరవింద్ కుమార్ కృషి వల్ల ఓయూలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారని? ప్రస్తుతం ఓ అడవిని సృష్టించామని అన్నారు. వృక్ష మిత్ర ఎంపీ సంతోష్ కుమార్ చేతుల మీదుగా పార్క్ ను విద్యార్థులు, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావటం సంతోషంగా ఉందని చెప్పారు. జీవజాతుల సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత దృష్ట్యా పాదచారులను కొంత వరకు కట్టడి చేశామని? ఉదయం, సాయంత్రం మాత్రమే కొంత మేరకు అనుమతిస్తున్నాని వెల్లడించారు. ముఖ్యమంత్రి సహకారం వల్ల పచ్చని చెట్లతో ఉస్మానియా ప్రాంగణం ఆహ్లాదకరంగా మారిందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్, ఎంపీ సంతోష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఓజోన్ డే సందర్భంగా ఓజోన్ పార్క్ ముందు ఎంపీ సంతోష్, వీసీ రవిందర్, రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, ఓఎస్డీ రెడ్యానాయక్ మొక్కలు నాటారు.

# దళితబంధు పథకంపై నీతి అయోగ్ ప్రశంసలు



కరీంనగర్, సెప్టెంబర్ 16: దళితులను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దళితబంధు పథకంపై నీతి అయోగ్ కమిటీ సభ్యులు ప్రశంసల వర్షం కురిపించారు. విశ్వనాథ్ బిష్ణయ్ నేతృత్వంలోని నీతి అయోగ్ బృందం.. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలో పర్యటించింది. ఈ సందర్భంగా దళితబంధు లబ్దిదారులు ఏర్పాటు చేసుకున్న యూనిట్లను నీతి అయోగ్ బృందం పరిశీలించింది. అనంతరం దళితుల అభిప్రాయాలను తెలుసుకుంది. హుజురాబాద్ పట్టణంలోని కనికుంట్ల కళ పేపర్ ప్లేట్స్ మేకింగ్ యూనిట్‌ను, బత్తుల అభిలాష, మ్యాకల నుశీల ఎంబ్రాయిడరీ మిషన్ యూనిట్‌ను, వేల్పుల శారద, కొనకోటి నవ్య నాన్ ఓవెన్ బ్యాగ్స్ తయారీ యూనిట్లను నీతి అయోగ్ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా నీతి అయోగ్ సభ్యులు మాట్లాడుతూ.. దళితుల సాధికారత కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ దళితబంధు పథకం ద్వారా అర్హులైన దళితులకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేయడం శుభ పరిణామం అని పేర్కొన్నది. పరిశ్రమలు, వ్యాపారాల ద్వారా ఉపాధి కల్పించేందుకు, దళిత సమాజం వ్యాపార వర్గంగా అభివృద్ధి చెందడంలో ఈ పథకం ఉపయోగపడుతుందని నీతి అయోగ్ బృంద సభ్యులు పేర్కొన్నారు. సమాజంలో దళితులు తమ కాళ్ళ మీద తాము నిలబడేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దళితులకు ఆర్థిక చేయూతను అందించేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. దళితుల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న ఈ పథకం చాలా బాగుందని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో నీతి ఆయోగ్ సభ్యులు కుమార్ జైన్, నిఖిత జాయిన్, యశస్విన్ సరస్వతి, ఇరామయి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి సురేష్, జిల్లా నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# విచ్ఛిన్నానికి కుట్రలు పన్నుతున్న బీజేపీ : మంత్రి జగదీష్ రెడ్డి



సూర్యాపేట, సెప్టెంబర్ 16: కులాల పేరుతో, మతాల పేరుతో విచ్ఛిన్నానికి బీజేపీ కుట్రలకు తెర లేపుతున్నది. ఆ ఉచ్చులో తెలంగాణ సమాజం పడొద్దని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 17 న జరుపుకునేది ముమ్మాటికీ జాతీయ సమైక్యత దినోత్సవమేనని ఆయన స్పష్టం చేశారు.

చరిత్ర తెలియని వారు వక్రీకరించి చెప్పే బాష్యాలు మనలో మనకు తగవులు పెట్టేందుకే నని ఆయన చెప్పారు.

ఈ నెల 17 న సీఎం కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలో భారీ ఎత్తున సమైక్యత ర్యాలీని నిర్వహించారు.

జిల్లా కేంద్రంలోని యస్.వి డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం పి.యస్ ఆర్ సెంటర్‌లో ర్యాలీ ముగింపు సందర్భంగా జరిగిన సభలో మంత్రిమాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వానికి తెలంగాణా ప్రతీక అన్నారు.

అది యావత్ భారతదేశానికి చాటి చెప్పేందుకే సీఎం కేసీఆర్ స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారన్నారు.

హిందు, ముస్లిం, క్రిస్టియన్ లు ఇక్కడ సోదర భావంతో కలిసిపోయారని ఆయన చెప్పారు.

కలిసి ఉంటేనే పురోగతిని సాధించవచ్చు అని గట్టిగా నమ్మే వ్యక్తి సీఎం కేసీఆర్ అని ఆయన అన్నారు. విడిపోయినప్పుడే విదేశీయులు భారతదేశం మీద దండ యాత్రలు కొనసాగించారన్నారు.

జాతీయ సమగ్రతకు తెలంగాణ మార్గదర్శనం కావాలి అన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యం అని మంత్రి జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు.

కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ అన్న పూర్ణమ్మ, జిల్లా ప్రజా పరిషత్ వైస్ చైర్మన్ వెంకట్ నారాయణ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జిల్లా కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బాలిలో జరిగిన జీ20 కార్మిక మరియు ఉపాధి మంత్రుల సమావేశానికి హాజరైన కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: ఈ ఏడాది సెప్టెంబర్ 13, 14 తేదీల్లో ఇండోనేషియాలోని బాలిలో జరిగిన జీ20 కార్మిక మరియు ఉపాధి మంత్రుల సమావేశానికి కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి శ్రీ. భూపేందర్ యాదవ్ హాజరయ్యారు.

మంత్రుల సదస్సులో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. మహమ్మారి అనంతర కాలంలో ఉపాధి కల్పన, సామాజిక రక్షణ, నైపుణ్యం మరియు అధికారికీకరణకు సంబంధించి దృఢమైన విధానాలను ప్రోత్సహించడానికి దేశాలు కలిసి రావాల్సిన ప్రాముఖ్యత గురించి వివరించారు.

ఎప్పటికప్పుడు మారుతున్న ప్రస్తుత కాలంలో కీలకమైన ప్రాధాన్యతా రంగాలను ఎంపిక చేసినందుకు ఇండోనేషియాను కేంద్ర మంత్రి ప్రశంసించారు. వాటిలో వికలాంగుల లేబర్ మార్కెట్ ఇంటిగ్రేషన్, కమ్యూనిటీ ఆధారిత వృత్తి శిక్షణను బలోపేతం చేయడం, వ్యవస్థాపకతను ప్రోత్సహించడం మరియు చిన్న మరియు మధ్యతరహా సంస్థలకు (ఎస్ఎంఈ) మద్దతు ఇవ్వడం ద్వారా వికలాంగుల స్థిరమైన వృద్ధి మరియు ఉత్పాదకత వంటివి ఉన్నాయి. ఈ రంగాలన్నింటిలో భారతదేశం సాధించిన ఆదర్శప్రాయమైన విజయాల పట్ల కూడా కేంద్ర మంత్రి వివరించారు. అడ్డా కార్మికులకు సామాజిక భద్రత కల్పించడానికి సామాజిక భద్రతా చట్టంలో చేసిన నిబంధనలను ఆయన హైలైట్ చేశారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్‌మెంట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సంవత్సరం జీ20 ఎంప్లాయ్‌మెంట్ వర్కింగ్ గ్రూప్ సమావేశాల నుండి పొందిన అనుభవాలు భారతదేశానికి రాబోయే అధ్యక్ష పదవిలో సహాయపడతాయని అలాగే 21వ శతాబ్దపు పని ప్రపంచానికి చెందిన డైనమిక్ స్వభావం దృష్ట్యా కార్మిక సంక్షేమాన్ని పొందేందుకు తమకు దోహదపడుతుందని ఆయన అన్నారు.

జర్మనీ, సింగపూర్, యూఏఈ, సౌదీ అరేబియా, నెదర్లాండ్స్, తుర్కియా వంటి దేశాలతో కేంద్ర మంత్రి పలు ద్వైపాక్షిక సమావేశాలు కూడా నిర్వహించారు. ఈ సమావేశాలన్నింటిలోనూ భారత్‌కు చేపట్టనున్న అధ్యక్ష పదవి మరియు విస్తృత ప్రాధాన్యతల గురించి మంత్రి వివరించారు. మన లక్ష్యాల సాధనకు ఆ దేశాలు మరియు సంస్థల మద్దతును కోరారు. వలసలు మరియు చలనశీలత ఒప్పందం, సామాజిక భద్రతా ఒప్పందంపై సంతకం చేయవలసిన అవసరం, అంతర్జాతీయ కార్మికులకు సామాజిక భద్రతను నిర్ధారించడానికి హైలైట్ చేయబడ్డాయి.

ఇండోనేషియా కార్మికశాఖ మంత్రి హెచ్‌ఈ ఇడా ఫౌజియా ఏర్పాటు చేసిన స్వాగత విందుకు కూడా కేంద్ర మంత్రి హాజరయ్యారు. జీ20కి చెందిన రెండు ప్రముఖ ఎంగేజ్‌మెంట్ గ్రూపులు బి20 - ఎల్20 సంయుక్త ప్రకటనను కూడా వీక్షించారు.

# బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలి : మంత్రి ఐకే రెడ్డి



నిర్మల్, సెప్టెంబర్ 16: బీజేపీ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే సీఎం కేసీఆర్ స్ఫూర్తిగా నూతన పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలని న్యాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి డిమాండ్ చేశారు. కుల మతాలకు అతీతంగా ఎంతో మంది నాటి రాజ్య హింసకు వ్యతిరేకంగా పోరాడితే.. విధిలేని పరిస్థితుల్లో నిజాం రాజు హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేశారన్నారు.

తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాలు నిర్మల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నిర్మల్ పట్టణంలోని మంచిర్యాల చౌరస్తా శివాజీ చౌక్ వద్ద మంత్రి ర్యాలీని ప్రారంభించి, 4 కి.మీ. పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..తెలంగాణ సెక్రటేరియట్‌కు రాజ్యాంగ నిర్మాత, మహా మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టడం చారిత్రాత్మకం అన్నారు.

తెలంగాణ ప్రజలందరికి ఇది గర్వకారణమని అన్నారు. దళితుల అభ్యున్నతి కోసం దళితబంధు అనే గొప్ప పథకాన్ని తీసుకువచ్చి వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారని ఆయన పేర్కొన్నారు.

# రాష్ట్ర జీడీపీ గతం కన్నా బాగుంది.. సీఎం జగన్

అమరావతి, సెప్టెంబర్ 16: రాష్ట్ర జీడీపీ గతం కన్నా బాగుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఏపీ అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ? రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఏడాదికి అప్పుల పెరుగుదల 17.45 శాతం అన్నారు. ఏడాదికి అప్పుల్లో సగటు పెరుగుదల 12.73శాతం అన్నారు. రాష్ట్రం చేస్తున్న అప్పులు చెల్లించడం కష్టమని చంద్రబాబు అండ్ కో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో కేంద్రం కన్నా రాష్ట్రం అప్పుల శాతం పెరిగిందన్నారు. ఇప్పుడు కేంద్రం కన్నా రాష్ట్రం అప్పుల శాతం తగ్గిందన్నారు.

# ఢిల్లీలో మంకీపాక్స్ 8వ కేసు- నైజీరియా మహిళకు పాజిటివ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: దేశ రాజధాని ఢిల్లీలో మంకీపాక్స్ 8వ కేసు నమోదైంది. 30 ఏళ్ల నైజీరియా మహిళకు మంకీపాక్స్ పాజిటివ్‌గా శుక్రవారం నిర్ధారణ అయ్యింది. లోక్ నాయక్ ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతున్నది. కాగా, మంకీపాక్స్ సోకిన మరో నైజీరియా మహిళ కూడా ఆసుపత్రిలో చేరినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ వ్యాధి లక్షణాలున్న మరో వ్యక్తి కూడా ఢిల్లీ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. ఈ ముగ్గురి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అన్నారు. దీంతో ఢిల్లీలో మంకీపాక్స్ కేసుల సంఖ్య 8కి చేరిందని అధికారులు వెల్లడించారు.

మరోవైపు దేశంలో మంకీపాక్స్ కేసుల సంఖ్య 13కు పెరిగింది. ఇందులో 8 కేసులు ఢిల్లీలో నమోదయ్యాయి. మరో ఐదు కేసులు కేరళలో వెలుగు చూశాయి. ఆఫ్రికా, ఐరోపా దేశాలను మంకీపాక్స్ వణికించింది. దేశంలో తొలి కేసు ఈ ఏడాది జూలై 14న కేరళలోని కొల్లాం జిల్లాలో నమోదైంది. ఆ రోగి కోలుకోవడంతో గత వారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. కేరళలో నమోదైన ఐదుగురు మంకీపాక్స్ రోగులు యూఏఈలో పర్యటించినట్లు వారి ట్రావెల్ హిస్టరీ ద్వారా తెలిసింది.

# హెడ్‌ఫోన్ పెట్టుకోలేకపోయిన పాక్ ప్రధాని.. పుతిన్ ముసిముసి నవ్వులు..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: ఉజ్జెకిస్థాన్‌లోని సమర్ఖండ్ నగరంలో షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఆ సమావేశాలకు హాజరైన పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్.. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కలిసి ద్వైపాక్షిక సంభాషణల్లో పాల్గొన్నారు. ఇద్దరి మధ్య ముఖాముఖి చర్చ జరుగుతున్న సమయంలో ఓ ఆసక్తికర సంఘటన జరిగింది. పాక్ ప్రధాని షెహబాజ్ తన వద్ద ఉన్న హెడ్‌ఫోన్లను సరైన రీతిలో పెట్టుకోలేకపోయాడు. హెడ్‌ఫోన్‌ను చెవిలో పెట్టుకునేందుకు పాక్ ప్రధాని తడబడ్డాడు. దాన్ని చూసిన పుతిన్ తనలో తాను నవ్వుకున్నారు. ఇక మరోసారి పాక్ ప్రధాని ప్రయత్నం చేసిన ఫలితం రాలేదు. ఈలోగా మళ్లీ హెడ్‌ఫోన్ మళ్లీ చెవి నుంచి కింద పడిపోయింది. ఆ సమయంలో పుతిన్ మరోసారి నవ్వాడు. పుతిన్ నవ్వులు ఆయన మైక్‌లో వినిపించాయి కూడా. హెడ్‌ఫోన్ పెట్టుకోలేకపోయిన పాక్ ప్రధాని..ఓ అధికారి సాయం కూడా కోరారు. ఇదంతా లైవ్ కెమెరాలో రికార్డు అయ్యింది. హెడ్‌ఫోన్ పెట్టులేకపోయిన ప్రధాని షెహబాజ్ దేశం పరువు తీశారంటూ ఇమ్రాన్ ఖాన్ పార్టీ ఆరోపించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇదే.



